# సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం ၊ 11 ၊ మార్చి ၊ 2025




## నల్లమలలో కార్చిచ్చు

కొల్లాపూర్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రాజుకుంది.

వివరాలు 8లో ▸

## రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 ( మంగళవారం సాయంత్రం)

సహర్ 5-07 ( బుధవారం తెల్లవారుజామున)

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.1 /17.5

ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ప్రజావాణికి 82 అర్జీలు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 82 అర్జీలు వచ్చాయి. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సిములు, ఆర్‌డీఓ నవీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం సెకండియర్ ఇంగ్లిష్ పేపర్‌కు సంబంధించిన పరీక్ష జరిగింది. 36 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 10,158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 9,920 మంది విద్యార్థులు హాజరై, 238 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ అధికారులతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

### నేటినుంచి కాచిగూడ డెమో రైలు పునరుద్ధరణ

**స్టేషన్ మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్–కాచిగూడ డెమో రైలును మంగళవారం నుంచి పునరుద్ధరించనున్నారు. కుంభమేళా నేపథ్యంలో దాదాపు 45 రోజుల పాటు ఈ రైలును భక్తుల సౌకర్యార్థం అక్కడికి నడిపారు. తిరిగి నేటి నుంచి ప్రతి రోజు ఉదయం 6.45 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ వరకు నడవనుంది. డెమో రైలు తిరిగి పునఃప్రారంభం కానుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సేవాభావంతో విద్య అందించాలి



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** దివ్యాంగ విద్యార్థులకు సేవాభావంతో విద్యను అందించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో స్పెషల్ ఎడ్యుకేషన్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ప్రతి వారం రెండుసార్లు ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహించాలని, ఆర్వీఎస్కే సహకారంతో స్పీచ్ థెరపీ, ప్రతి ఐఆర్‌సీకి ర్యాంప్‌లు, రేలింగ్ వంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిర్మాణం కోసం అనుమతులు, ఇతర మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతి పాఠశాలకు ఒక స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌ను అటాచ్ చేస్తామని, కార్యక్రమాలు విజయవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

■ జిల్లాకేంద్రంలోని ఏనుగొండ ప్రైమరీ స్కూల్‌ను డీఈఓ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన టీవీ వినియోగం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు..అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వేరుశనగ క్వింటాల్ రూ.7,061

**జడ్చర్ల:** బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.7,061, కనిష్టంగా రూ.4,691 ధరలు లభించాయి. అదేవిధంగా కందులు గరిష్టంగా రూ.6,851, కనిష్టంగా రూ.5,400, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,361, కనిష్టంగా రూ.2,001, పెబ్బర్లు రూ.6,500, జొన్నలు రూ.3,601, మినుములు రూ.7.417 ధరలు లభించాయి.

### విద్యాభివృద్ధి, మౌలిక వసతులకే ఖర్చు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- విద్యానిధికి మైహోం గ్రూప్ రూ.10 లక్షల విరాళం

### అక్రమ నిర్మాణాలపై ఉదాసీనత ఎందుకు?

- కలెక్టర్ ఆదేశించినా స్పందించడం లేదు
- అధికారుల తీరుపై జడ్చర్ల కౌన్సిలర్ల ధ్వజం

- వివరాలు 9లో..

# మిగిలింది 20 రోజులే..

- మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు అంతంతే
- సీఎం ఇలాఖాలో 57 శాతమే వసూలుతో రాష్ట్రస్థాయిలో 63వ స్థానం
- ఉమ్మడి జిల్లాలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లే దిక్కు
- ప్రత్యేకంగా సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళాలు
- గడువు నేపథ్యంలో పరుగులు పెట్టిస్తున్న ప్రత్యేకాధికారులు



**నారాయణపేట:** మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతోపాటు ఆస్తి పన్నుల రాబడితో పట్టణాల్లో ప్రగతి పరుగులు పెడుతుంది. మున్సిపాలిటీల్లోని నివాసగృహాలు, వాణిజ్య సముదాయ భవనాలకు 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్ను వసూలుపై మున్సిపల్ అధికార యంత్రాంగం డిజిటల్ చెల్లింపు (టెక్నాలజీ)లపై దృష్టిసారించింది. క్యూఆర్ కోడ్ స్కాన్, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ, వాట్సప్ నంబర్, ఏటీఎం ద్వారా నేరుగా ఆయా మున్సిపాలిటీ ఖాతాల్లో జమ చేయవచ్చని చెబుతోంది. అయితే ప్రభుత్వం చేపట్టిన సర్వేలతోనే మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లకు అధికారులు ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి పడినట్లు చెబుతున్నారు. అయితే మున్సిపాలిటీల్లో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వసూలు అంతంత మాత్రమే ఉండటం.. టార్గెట్ చేరుకునేందుకు కేవలం 20 రోజులే ఉండటంతో అధికారులు సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు.

**80 శాతంతో నాలుగో స్థానం..**

రాష్ట్రస్థాయిలో పన్నులు వసూలు చేయడంలో ఉమ్మడి జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీ నాలుగో స్థానంలో నిలిచింది. సుమారు 4 వేల ఆస్తులకు రూ.98 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.78 లక్షలు (80 శాతం) వసూలు చేశారు.

**అదనపు కలెక్టర్లకు బాధ్యతలు..**

ఈ ఏడాది జనవరి 26తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్) ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించింది. వీరు మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ఎప్పటికప్పుడు మున్సిపల్ రెవెన్యూ, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, కమిషనర్లకు ఆదేశాలు ఇస్తున్నారు. వారం రోజులుగా ప్రత్యేక దృష్టి సారిస్తూ రోజూవారిగా పన్నుల వసూళ్లపై నివేదిక తెప్పించుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లకు మిగిలింది కేవలం 20 రోజులేనని.. అంతలోపే లక్ష్యం చేరుకోవాలని ప్రత్యేకాధికారులు మున్సిపల్ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆస్తి, నీటి పన్ను చెల్లింపులు, రివిజన్ పిటిషన్ సహా ఇతర సమస్యల పరిష్కారం కోసం సోమ, గురువారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మున్సిపాలిటీల్లో రెవెన్యూ మేళా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేళా ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి, నీటి పన్ను చెల్లింపులు, ఇతర సమస్యలకు పరిష్కారం పొందవచ్చు. ప్రాపర్టీ పేరు మార్పు, మ్యూటేషన్, ఇంటి నంబర్ కేటాయింపు లేదా మార్పు వంటి సేవలు పొందవచ్చు.



ఏనుగొండలో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

### రాష్ట్రస్థాయిలో 63వ స్థానం..

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మున్సిపాలిటీలో 5,332 ఆస్తులకు రూ.1.94 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.1.10 కోట్లు (57 శాతం) వసూలు చేశా రు. దీంతో ఈ మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో 63వ స్థానంలో నిలిచింది. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లపూర్‌లో సైతం 6,406 ఆస్తుల కు రూ.1.28 కోట్లకు రూ.72 లక్షలు వసూలు (56 శాతం) చేశారు. ఈ మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో 68వ స్థానంలో నిలిచింది.

**ఉమ్మడి జిల్లా పరిధిలో ఆస్తులు పన్నులు, వసూలు (రూ.కోట్లలో)**

| మున్సిపాలిటీ | ఆస్తులు | పన్నులు | వసూలైంది | శాతం | రాష్ట్రంలో ర్యాంకు |
|---|---|---|---|---|---|
| వడ్డేపల్లి | 4,000 | 0.98 | 0.78 | 80 | 4 |
| అలంపూర్ | 3,541 | 0.48 | 0.38 | 63 | 38 |
| అయిజ | 8,051 | 1.69 | 1.01 | 60 | 49 |
| గద్వాల | 15,898 | 7.28 | 3.01 | 41 | 116 |
| జడ్చర్ల | 18,331 | 5.94 | 2.74 | 46 | 107 |
| భూత్పూర్ | 3,550 | 2.91 | 1.49 | 51 | 90 |
| మహబూబ్‌నగర్ | 52,058 | 49.25 | 17.60 | 35 | 125 |
| పెబ్బేరు | 5,317 | 0.95 | 0.68 | 72 | 10 |
| కొత్తకోట | 7,256 | 1.62 | 0.93 | 57 | 58 |
| అమరచింత | 2,761 | 0.55 | 0.31 | 56 | 65 |
| ఆత్మకూర్ | 5,348 | 2.40 | 1.11 | 46 | 106 |
| వనపర్తి | 18,113 | 12.04 | 4.05 | 34 | 128 |
| నారాయణపేట | 9,301 | 5.08 | 1.95 | 38 | 120 |
| మక్తల్ | 7,733 | 2.02 | 1.15 | 57 | 62 |
| కోస్గి | 5,332 | 1.94 | 1.10 | 57 | 63 |
| కొల్లాపూర్ | 6,406 | 1.28 | 0.72 | 56 | 68 |
| అచ్చంపేట | 6,677 | 3.43 | 1.87 | 55 | 75 |
| నాగర్‌కర్నూల్ | 10,949 | 6.71 | 3.58 | 53 | 83 |
| కల్వకుర్తి | 8,185 | 7.52 | 2.20 | 30 | 132 |

### రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లేక..

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లకు బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులే దిక్కయ్యారు. మున్సిపాలిటీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో పన్నుల వసూలు చేయడంలో జాప్యం జరుగుతుందని అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. రెవెన్యూకు సంబంధించిన విషయం కావడంతో ప్రధాన మున్సిపాలిటీల్లో తప్పా కొత్తగా ఏర్పాటైన వాటిలో ఇప్పటి వరకు ఆ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని సమాచారం. పన్నులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతుండటం మరో సమస్యగా చెబుతున్నారు.

### లక్ష్యం చేరుకుంటాం..



ప్రతి ఏడాది మార్చిలోనే అత్యధికంగా పన్నులు వసూలు అవుతాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది కాబట్టి పట్టణ ప్రజలు, వ్యాపారులు తమ ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలి. గత వారం రోజులుగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాం. ఈ నెల 31 వరకు వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు కృషిచేస్తున్నాం.

– భోగేశ్వర్, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

# ఆహార భద్రతకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించి ఆహార భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ చైర్మన్‌గా వివిధ శాఖల అధికారులతో జిల్లా ఆహార భద్రత సలహా మండలి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీలో రెవెన్యూ అదనపు కలెక్టర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ, పరిశ్రమలశాఖ జీఎంలు, డీఈఓ, జిల్లా పౌరసరఫరాల అధికారి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఆహార భద్రత చట్టం అనుసరించి జిల్లాలో ఆహార భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లాకు నూతనంగా రీజనల్ ఫుడ్ లేబరేటరీ, ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వెహికల్ కూడా రాబోతుందని పేర్కొన్నారు. వీటి ద్వారా జిల్లాలో మరింత మెరుగ్గా ఆహార కల్తీ నిరోధానికి పాటుపడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో, వసతిగృహాల్లో, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పాఠశాలల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి పరీక్షించాలని, రక్తహీనత, ఐరన్ లోపం ఉన్న వారికి తగు చికిత్స అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మనోజ్, డీఈఓ ప్రవీణ్ కుమార్, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికాంత్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి**

జిల్లాలో తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరాపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరాలో సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. భూగర్భ జల వనరులు తగ్గినా పంటలు ఎండిపోకుండా రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా కలిసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

### రైతులకు సాగు నీళ్ల సరఫరా చేయాలి

పంటలకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని, రైతులకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో సాగు నీరు సమస్యతో పంటలు ఎండి పోకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# విద్యకు మహర్దశ

- ఉమ్మడి జిల్లాలో 10 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు
- ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున నిధులు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** చదువులో వెనుకబడిన పాలమూరు జిల్లాలో విద్యకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నిధులు విడుదల చేసింది. ఇప్పటికే దాదాపు అన్ని పాఠశాలలకు స్థల పరిశీలన చేసిన అధికారులు, ఐదునెలల క్రితం పనులకు శంకుస్థాపన కూడా చేశారు. రెండు రోజుల క్రితం నిధులకు సంబంధించిన జీఓలను ప్రభుత్వం విడుదల చేయండంతో స్కూల్స్ నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. ఉమ్మడి జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, జడ్చర్ల, దేవరకద్ర, గద్వాల, నారాయణపేట, మక్తల్, వనపర్తి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున రూ.2,000 కోట్లు కేటాయించారు.

■ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించనున్నారు. ఒక్కో స్కూల్ కోసం 20 నుంచి 25 ఎకరాల భూమిని సేకరించనున్నారు. విశాలమైన ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్య, విశాలమైన తరగతి గదులు, హాస్టల్ భవనం, లైబ్రరీలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, యాంఫీథియేటర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇందులో 2,500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు.

# మహబూబ్‌నగర్‌కే ఎక్కువ నిధులా?



పనుల ప్రతిపాదలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

- జిల్లాలోని మిగతా నియోకవర్గాలకూ ప్రాధాన్యం ఇవ్వాలి
- పార్కుల అభివృద్ధిని మున్సిపల్ కార్పొరేషన్ చూసుకోవాలి
- ముడా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** ముడా నుంచి జిల్లాలోని మహబూబ్‌నగర్ నియోజకవర్గానికే ఎక్కువ నిధులు కేటాయిస్తే ఎలా అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ముడా కార్యాలయంలో చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగతా నియోకవర్గాలకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇక నుంచి మహబూబ్‌నగర్ (పరిగి నియోజవకర్గంలోని రెండు మండలాలు కలుపుకొని)కు 40 శాతం, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు 30 శాతం చొప్పున మంజూరు చేస్తే బాగుంటుందన్నారు. అందుకు వైస్ చైర్మన్ డి.మహేశ్వర్‌రెడ్డి అంగీకారం తెలిపారు. ఇక గతంలోనూ మహబూబ్‌నగర్‌కు తప్పా ఇతర నియోజకవర్గాలకు అసలు కేటాయింపులే జరగలేదని ఆయన వాపోయారు. జిల్లాకేంద్రంలోని పది పార్కుల అభివృద్ధికి అయ్యే రూ.3.30 కోట్లను కేవలం మున్సిపల్ కార్పొరేషన్ నిధుల నుంచి కేటాయించాలన్నారు. ఇదివరకే చేపట్టిన పనుల్లో తన నియోజకవర్గంలో 34 పెండింగ్‌లో ఉన్నాయని, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందన్నారు. కాగా, జిల్లాలో ఏఈల కొరత తీవ్రంగా ఉందని, చాలా చోట్ల డిప్యూటేషన్‌పై పని చేస్తున్నందున ఈ పరిస్థితి నెలకొందని పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి బదులిచ్చారు. ముడాకు ప్రత్యేకంగా ఈఈ, ఇద్దరు డీఈఈలు, నియోజవర్గానికి ఒక్కొక్కరు చొప్పున ఏఈ పోస్టులు కేటాయిస్తే పనులు త్వరగా చేపట్టడానికి వీలవుతుందని సమావేశం దృష్టికి తెచ్చారు. కాగా, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ముడా పాలకవర్గం అమోదంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచించారు.

### కేటాయింపులు ఇలా..

ఇక మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి రూ.14,05,06,000లతో 108 పనులు, జడ్చర్లకు రూ.8,21,50,000లతో 142, దేవరకద్రకు రూ.8,20,00,000లతో 192, పరిగి నియోజకవర్గంలోని మహమ్మదాబాద్, గండేడ్ మండలాలకు రూ.1,54,10,000లతో 77 పనులు (ఇలా మొత్తం రూ.32,00,66,000) చేపట్టేందుకు ప్రతిపాదనలు చేయగా పాలకవర్గం ఆమోదం తెలిపింది. అలాగే కార్పస్‌ఫండ్ కింద ముడాకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించింది. జిల్లాకేంద్రంలోని బైపాస్, భూత్పూర్ రోడ్డు, ఎన్‌హెచ్–167లపై ఐదు చోట్ల మొక్కల పెంపకం, సంరక్షణకు గాను నిర్వహణ ఖర్చుల కింద రూ.1.84 కోట్లు కేటాయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్‌లో.. మెప్మా విలీనం

- ఒకే గొడుగు కిందికి రానున్న మహిళా సంఘాలు
- డీఆర్‌డీఏ పరిధిలోకి రిసోర్స్‌పర్సన్లు
- ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వం



**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మెప్మా.. ఇక నుంచి డీఆర్డీఏలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడగానే జిల్లాలోని మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల, దేవరకద్ర మున్సిపాలిటీల్లోని మెప్మా ఉద్యోగులు, సిబ్బందితో పాటు జిల్లాకేంద్రంలోని మెప్మా జిల్లా కార్యాలయం ఉద్యోగులు అందరూ సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నారు.

**పట్టణాల్లో సర్వేలకు ఇబ్బందే..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, ఇతరత్రా పనులను క్షేత్రస్థాయిలో మెప్మా ఆర్పీలు సీఓలు సర్వే చేస్తుంటారు. మెప్మా ఆర్పీలకు కాలనీల్లో ఉండే వివరాలు తేలికగా తెలిసే అవకాశం ఉంటుందని.. ప్రతి సర్వేకు వారి సేవలను వినియోగించుకున్నారు. ఇక నుంచి వారు ఇతర శాఖ పరిధిలోకి వెళ్తే.. మున్సిపాలిటీ సేవలకు వారు వచ్చే అవకాశం ఉండకపోవచ్చు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ప్రభుత్వం చేపట్టే సర్వే చేయాలంటే ఇక నుంచి మున్సిపల్ యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

### మార్గదర్శకాలు రాలేదు..

డీఆర్‌డీఏలో మెప్మాను విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఇప్పటి దాక మాకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గ దర్శకాల మేరకు నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతానికి డీఆర్‌డీఏ, మెప్మాలు వేరువేరుగా విధులు నిర్వహిస్తున్నాయి.

– నర్సిములు, డీఆర్‌డీఏ

### కమిషనర్ల ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది విధులు

మున్సిపాలిటీల్లో మహిళలను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసే మెప్మా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పురపాలిక వార్డుల్లో క్షేత్రస్థాయిలో పని చేసే మెప్మా రిసోర్స్‌పర్సన్లు (ఆర్పీలు) 97 మంది ఉన్నారు. వార్డుల్లో మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్న వీరంతా మున్సిపాలిటీ కమిషనర్ల ఆధ్వర్యంలో పని చేస్తున్నారు. వీరు మహిళా సంఘాలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడంతో పాటు నెలనెలా తిరిగి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటారు. ఇక.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనిని సెర్ప్ కార్యాలయం కింద పని చేసే ఉద్యోగులు పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు శాఖలను విలీనం చేస్తే మెప్మా ఉద్యోగులు సెర్ప్ కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు.



సొరంగంలో సహాయచర్యలు చేపడుతున్న రెస్క్యూ బృందాలు

## ఆ ఏడుగురి కోసం అన్వేషణ

- టన్నెల్‌లో కాడవర్ డాగ్స్‌తో గాలింపు ముమ్మరం
- కీలకంగా వ్యవహరిస్తున్న సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్లు
- ఇప్పటికే ఒక కార్మికుడి మృతదేహం లభ్యం
- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

- వివరాలు 8లో..

- సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట రూరల్

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో రైతు మృతి


బక్కయ్యగౌడ్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: పంటకు నీరందించేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. యాపట్లకు చెందిన రైతు బక్కయ్యగౌడ్ (60)కు మూడెకరాల పొలం ఉండగా.. వేరుశనగ పంట సాగుచేశాడు. ఆదివారం రాత్రి పంటకు నీరందించేందుకు వెళ్లిన అతడు.. విద్యుత్ బోరుమోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య కిష్టమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు శివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


కుర్వ పూల మహేష్(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన రైతు కుర్వ పూల మహేష్(39) పురుగుల మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూసాపేట ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మహ్మదుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన మహేష్ ఐదేళ్ల క్రితం రూ.30 లక్షలు ఫైనాన్స్ తీసుకుని రెండు హార్వేస్టర్లు కొనుగోలు చేశాడు. వాటి ద్వారా నష్టం వాటిల్లడంతో వాటిని అమ్మేశాడు. తర్వాత గ్రామంలో కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశాడు. పంటల సాగుకు చేసిన అప్పులు కూడా తీరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన మహేష్ ఈనెల 9న ఉదయం ఇంటి వద్ద పురుగుల మందును తాగాడు. కొద్దిసేపటికే గమనించిన తల్లి నారమ్మ వెంటనే జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది. మృతుడి తల్లి నారమ్మ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### అన్నదమ్ముల గొడవలో తమ్ముడిపై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు పొలానికి నీళ్ల పెట్టుకునే క్రమంలో జరిగిన గొడవలో అన్నపై దాడి చేసిన తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన బాలకిష్టయ్య ఆదివారం సాయంత్రం తన పొలానికి నీళ్లు పారిస్తున్నాడు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన తమ్ముడు రవి నీళ్లు పారించుకునే వంతుల విషయంలో గొడవపడ్డారు. ఈక్రమంలో రవి కర్రను తీసుకొని బాలకిష్టయ్యపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో బాలకిష్టయ్య సోమవారం అడ్డాకుల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. గాయపడిన బాలకిష్టయ్యను పోలీసులు ఆస్పత్రికి పంపించారు. తమ్ముడు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆన్‌లైన్‌లో పెట్టుబడి.. మోసపోయిన యువకుడు

కొత్తకోట రూరల్: సైబర్ నేరాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. ఎక్కడో చోట ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి మోసపోతున్న వారు వెలుగులోకి వస్తూనే ఉన్నారు. తాజాగా కొత్తకోటకు చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. ఎస్‌ఐ ఆనంద్ వివరాల మేరకు.. కొత్తకోటకు చెందిన డి.ఉదయ్‌కుమార్‌ను ఈ నెల 3న గుర్తుతెలియని వ్యక్తి టెలిగ్రామ్ యాప్‌లో 'బిట్ కైన్ ఇన్వెస్టర్' గ్రూప్‌లో యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లో ఒక లింక్‌ను పంపించి.. అందులో డబ్బులు పెట్టుబడిగా పెడితే రెట్టింపు అవుతాయని చెప్పారు. నమ్మిన ఉదయ్‌కుమార్.. అదే రోజు తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.70వేలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు పెద్ద మొత్తంలో రావడంతో సైబర్ నేరగాడు రాత్రికి రాత్రే ఆ టెలిగ్రామ్‌లో ఉన్న ఇన్వెస్టర్ గ్రూప్ మొత్తాన్ని తొలగించాడు. మోసపోయానని తెలుసుకున్న ఉదయ్‌కుమార్.. 1930కు కాల్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### నవజాత శిశువును కాపాడిన 108 సిబ్బంది

నర్వ: నవజాత శిశువుకు 108 సిబ్బంది సీపీఆర్ చేసి కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాయికోడ్‌కు చెందిన గర్భిణి అఖిల మొదటి కాన్పు నిమిత్తం సోమవారం నర్వ పీహెచ్‌సీకి వచ్చింది. మధ్యాహ్నం సాధారణ ప్రసవమై మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువు ఉమ్మనీరు మింగడంతో శ్వాస తీసుకోలేకయింది. ఈ క్రమంలో శిశువు మరణించిందని అందరూ భావించారు. అయితే ప్రసవం చేసిన నర్సు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్నారు. శిశువు అంబులెన్స్‌లోకి తీసుకొని ఆర్‌సీపీ డాక్టర్ శివ, మరో డాక్టర్ మానిక సూచనలతో సీపీఆర్ చేశారు. నవజాత శిశువుకు మందులు, ఆక్సిజన్ అందిస్తూ.. మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. నవజాత శిశువును సీపీఆర్‌తో కాపాడిన 108 సిబ్బందిని చిన్నపిల్లల వైద్యురాలు మమత అభినందించారు.

# ఆ ఏడుగురి కోసం అన్వేషణ


సొరంగంలో కాడవర్ డాగ్స్ స్క్వాడ్

- టన్నెల్‌లో కాడవర్ డాగ్స్‌తో గాలింపు ముమ్మరం
- కీలకంగా వ్యవహరిస్తున్న సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్లు
- ఇప్పటికే ఒక కార్మికుడి మృతదేహం లభ్యం
- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

సాక్షి, నాగర్‌కర్నూల్ /అచ్చంపేట రూరల్: దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి కోసం 17 రోజులుగా చేపడుతున్న సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిలో ఒకరి మృతదేహం ఆదివారం లభించడంతో సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఇప్పటికే 14 బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటుండగా.. సింగరేణి కార్మికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. సొరంగం లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా వచ్చిన కాడవర్ డాగ్స్ తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. జీపీఆర్, కాడవర్ డాగ్స్ చూయించిన ప్రదేశంలోనే ప్రధానంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ఆదివారం రాబిన్స్ కంపెనీలో టీబీఎం ఆపరేటర్‌గా పని చేస్తున్న గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించింది. దీంతో మిగతా 7 మంది కోసం సహాయక బృందాలు అన్వేషణను ముమ్మరం చేశాయి. టీబీఎం విడి భాగాలను తొలగిస్తూనే ఆ ఏడు మంది కోసం సొరంగంలో గాలిస్తున్నారు. స్థానిక యంత్రాంగం గంటగంటకూ సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారు.

**సహాయక చర్యలకు అన్నీ సవాళ్లే..**

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 13.850 కి.మీ. వద్ద ప్రమాదం చోటుచేసుకోగా, అక్కడి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడమే రెస్క్యూ బృందాలకు ప్రతిరోజు క్లిష్టతరమవుతోంది. సొరంగంలో 13 కి.మీ. లోపల రెస్క్యూ నిర్వహించే సిబ్బందికి సైతం ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. 16 రోజుల పాటు నిరంతరం శ్రమించిన రెస్క్యూ బృందాలకు ఆదివారం ఒక కార్మికుడి మృతదేహం లభ్యమైంది. సమీపంలో గాలిస్తున్నా మిగతా వారి ఆచూకీ లభించడం లేదు. సోమవారం రెస్క్యూ బృందాలతో కలసి సొరంగంలోని ప్రమాదస్థలం వద్దకు 'సాక్షి' వెళ్లి పరిశీలించింది. సొరంగం ఇన్‌లెట్ నుంచి 13.850 కి.మీ. దూరంలో ఉన్న ప్రమాదస్థలం వద్దకు రెస్క్యూ బృందాలు చేరుకునేందుకే కనీసం 1.45 గంటలు పడుతోంది. లోకోట్రైన్ ద్వారా రాకపోకలకే కనీసం 3 -4 గంటలు పడుతోంది. ఒక్కో షిఫ్టులో సహాయక బృందాలు 12 గంటల పాటు పనిచేస్తున్నారు. సొరంగంలో 12 కి.మీ. వద్దకు చేరుకున్నాక సీపేజీ నీరు, బురద వస్తోంది. 13.200 కి.మీ. పాయింట్ వరకూ లోకో ట్రైన్ వెళ్లగలుగుతోంది. లోకో ట్రైన్ ట్రాక్ తర్వాత రెండు ఎస్కవేటర్లు మట్టి, శిథిలాలను తొలగిస్తున్నాయి. 13.400 వద్ద టీబీఎం భాగాలు టన్నెల్ నిండా చిక్కుకుని ఉండగా, సహాయక బృందాలు లోపలికి వెళ్లేందుకు వీలుగా కుడివైపు నుంచి మిషిన్ భాగాలను కట్‌చేసి దారిని ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ప్రమాదస్థలం 13.850 వరకూ కాలినడకన బురద, శిథిలాల మధ్య జాగ్రత్తలు పాటిస్తూ చేరుకోవాల్సి ఉంటుంది. సొరంగానికి కుడివైపున కన్వేయర్ బెల్టు అందుబాటులోకి తీసుకురాగలిగారు. సుమారు 150 మీటర్ల విస్తీర్ణంలో 15 ఫీట్ల ఎత్తులో టన్నెల్ నిండా మట్టి, బురద పేరుకుని ఉండటంతో వాటిని తొలగించేందుకు రోజులు పట్టే అవకాశం ఉంది. దీంతో కడావర్ డాగ్స్ సూచించిన ప్రాంతాల్లోనే తవ్వకాలను జరిపి కార్మికుల జాడ కోసం అన్వేషణ చేపడుతున్నారు.


ప్రమాద స్థలంలో గుర్తించిన డీ2 పాయింట్ వద్ద సింగరేణి బృందాలు

#### అభినందనల వెల్లువ..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న 8 మందిలో ఒకరి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చిన సహాయక బృందాలను ప్రజాప్రతినిధులు, వివిధ విపత్తుల ఉన్నతాధికారులు అభినందించారు. సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురుప్రీతిసింగ్ మృతిచెందడం బాధాకరమని, తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మున్ముందు జరగబోయే సహాయక చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్ఫూర్తితో మిగిలిన సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. సహాయక బృందాలు పూర్తిస్థాయిలో పాల్గొని పనులను వేగంగా ముగించాలని ఆదేశించారు. అలాగే టన్నెల్ వద్ద సహాయక సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. సహాయక చర్యల్లో పాల్గొనే బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. సమావేశంలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన కాడవర్ డాగ్స్ స్క్వాడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

#### ఆ చోటనే గాలింపు

సొరంగంలో చిక్కుకున్న 8 మందిలో గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైన ప్రదేశంలో పక్కనే ఆదివారం, సోమవారం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్, జీపీఆర్ సిస్టం ద్వారా గుర్తించిన డీ1, డీ2 లోకేషన్లలో సింగరేణి కార్మికులు, ర్యాట్ హోల్ మైనర్లు, ఇతర సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సహాయక బృందాలకు దిశానిర్దేశం చేస్తూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ పలు సూచనలు చేశారు. మంగళవారం సొరంగం వద్ద సహాయక చర్యల్లో భాగంగా రోబోలు రంగంలోకి దిగనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబో నిపుణులు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించనున్నారు.

### అలంపూర్ క్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి క్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. ఆలయ సముదాయంలోని చైర్మన్ చాంబర్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగుళాంబ ఆలయ అభివృద్ధిపై ఈ నెల 7న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జోగుళాంబ ఆలయ సమగ్ర అభివృద్ధికి తాత్కాలిక, దీర్ఘకాలిక పనుల జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికీ అలంపూర్‌లో ఐదవ శక్తి పీఠం ఉన్నట్టు చాలా మందికి తెలియని పరిస్థితి ఉందన్నారు. ఆలయ చరిత్రతో కూడిన ప్రచార బోర్డులు పెట్టడానికి ప్రధాన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల ఆలయాల్లో అవినీతి జరిగిందని.. అర్చకుల పనితీరుపై మీడియాలో కథనాలు వస్తున్నాయన్నారు. అందుకు సంబంధించిన రికార్డులను దేవదాయశాఖకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఆలయాల ప్రతిష్ట దెబ్బతీసే విధంగా ఎవరూ ప్రయత్నించవద్దని కోరారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, జగన్మోహన్ నాయుడు, జగన్‌గౌడు, గోపాల్, అడ్డాకుల రాము ఉన్నారు.

# నల్లమలలో కార్చిచ్చు


నల్లమల అడవిలో వ్యాప్తిచెందిన మంటలు


మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

- జాలుపెంట, చుక్కలపెంటల్లో 15 రోజుల క్రితం అంటుకున్న అడవి
- రోజురోజుకూ వ్యాప్తి చెందుతున్న మంటలు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అటవీ శాఖాధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశంతో వినియోగంలోకి బ్లోయర్స్

కొల్లాపూర్: నియోజకవర్గ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రాజుకుంది. 15 రోజుల క్రితం జాలుపెంట, చుక్కలపెంట ప్రాంతాల్లో అడవి అంటుకొని మంటలు చెలరేగాయి. వాటిని ఆర్పివేయడంలో కొల్లాపూర్ అటవీ శాఖాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వాతావరణ మార్పుల కారణంగా మంటల వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. చిన్నపాటి మంటలే కదా అనుకున్న అటవీ అధికారులకు కార్చిచ్చు తలనొప్పిగా మారింది. కొన్ని రోజులుగా అధిక వేడితో పాటు గాలులు వీస్తుండడంతో మంటలు సమీప ప్రాంతాలకు వ్యాపించాయి. జాలుపెంట, చుక్కలపెంట, పెగ్గర్లపెంట, తొంగిచూపులు ప్రాంతాల్లో మంటలు చెలరేగుతున్నాయి. మంటలను అదుపుచేయలేక సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో వారి ఆదేశానుసారం మంటలను ఆర్పేందుకు బ్లోయర్స్‌ను వినియోగిస్తున్నారు. అయినా కూడా మంటలు అదుపులోకి రావడం లేదు. శివరాత్రి సందర్భంగా అటవీ మార్గంగుండా శ్రీశైలం వెళ్లిన శివస్వాములే మంటల వ్యాప్తికి కారణమై ఉంటారని ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ అనుమానం వ్యక్తం చేశారు. అడవిలో మంటలు వ్యాప్తి చెందుతున్నాయని గొర్రెలు, పశువుల కాపరులతో పాటు ఇతరులు ఎవరూ అనుమతు లేకుండా అడవిలోకి ప్రవేశించరాదని ఆయన హెచ్చరించారు. అగ్ని ప్రమాదం కారణంగా అడవిలో జీవజాలం చనిపోతుందని, దీనివల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుందని ఆయన వివరించారు. మంటలను అదుపుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### మంటల వ్యాప్తికి కారణమైన వ్యక్తి అరెస్టు


అచ్చంపేట కోర్టు వద్ద శీలం బయన్నతో అటవీ సిబ్బంది

దోమలపెంట: అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని దోమలపెంట రేంజ్ అటవీ ప్రాంతంలో మంటల వ్యాప్తికి కారణమైన వ్యక్తి శీలం బయన్నను సోమవారం కోర్టులో హాజరుపర్చినట్లు దోమలపెంట ఎఫ్‌ఆర్‌ఓ గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 2, 3 తేదీల్లో దోమలపెంట రేంజ్ పరిధిలోని దూబోడు, ఉల్లిందలూట బీట్లలో రాత్రివేళలో వ్యాపించిన మంటలను జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో 7 బృందాలు శ్రమించి అదుపులోకి తెచ్చాయి. అయితే ఇతర ప్రాంతాల్లో మంటలు, పొగలు వస్తుండటంతో అడవిలో అన్ని బ్లాక్‌లను కాలినడక ద్వారా వెళ్లి ఆర్పుతుండగా సమీపంలో నివాసముంటున్న పదర మండలం చిట్లంకుంట గ్రామానికి చెందిన శీలం బయన్న మేకలను కాయడం తారసపడిందన్నారు. అతన్ని విచారించగా లింగాలగట్టుకు చెందిన బాలచెన్నయ్యకు చెందిన మేకలు కాస్తున్నట్లు చెప్పారని, బయన్న వద్ద అగ్గిపెట్టె, బీడీలు, పొగాకును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుమారు 150 హెక్టార్ల విస్తీర్ణం మేర అడవిలో మంటలు వ్యాపించడానికి శీలం బయన్న కారణమని, కేసు నమోదు చేసి అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారన్నారు.

### ఘర్షణను అడ్డుకునేందుకు వెళ్లి.. నిండు ప్రాణం బలి

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- ఇద్దరిపై కేసు నమోదు

గద్వాల క్రైం: గృహ నిర్మాణ విషయంలో తాపీ మేస్త్రీలు, ఇంటి యజమాని మధ్య జరిగిన ఘర్షణను అడ్డుకునేందుకు వెళ్లి ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ ఘటనలో జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల మండలం కుర్వపల్లిలో చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాలు.. కుర్వపల్లికి చెందిన కుర్వ పద్మ తన ఇంటి నిర్మాణ పనులను గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీలు కుర్వ రామకృష్ణ, కుర్వ కృష్ణకు అప్పగించింది. అనుకున్న సమయానికి పనులు చేయక నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో విసుగు చెందిన పద్మ ఇతరులతో నిర్మాణ పనులు చేయించింది. ఈనెల 6వ తేదీ రాత్రి తాపీ మేస్త్రీలిద్దరూ పద్మ ఇంటి వద్దకొచ్చి ఘర్షణ పడ్డారు. పద్మ అక్క అయిన కుర్వ జయమ్మ(45) ఘర్షణను అడ్డుకుంది. ఈ క్రమంలో అడ్డు వచ్చిన ఆమెను కిందకు తోసివేశారు. కింద పడిన మహిళ స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈఘటనపై కుర్వ పద్మ ఫిర్యాదు మేరకు రామకృష్ణ, కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత


పంచనామా నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కొత్తపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మద్దూర్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కాల్‌కు బొలెరోలో తరలిస్తున్నట్లు సమాచారం అందింది. సోమవారం తెల్లవారుజామున కొత్తపల్లి మండలం భూనీడు గ్రామ శివారులో వాహనంలో బియ్యాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై కోస్గి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారమివ్వగా పట్టుబడిన బియ్యాన్ని పంచనామా నిర్వహించారు. వాహనంలో 57బస్తాలు 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించి డ్రైవర్ పరశురాం, యజమానికి శ్రీనివాస్‌ఐ కేసు నమోదుచేశారు. ఈ బియ్యం దేవరకద్ర మండలం పూసలపహాడ్ నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొట్టి.. బోల్తా పడిన బొలెరో


ప్రమాదంలో గాయపడిన కూలీలు


మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను కర్నూలు ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

- ఐదుగురు కూలీలకు తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- నిర్లక్ష్యం, అతివేగంతో కూడిన డ్రైవింగ్‌తోనే ప్రమాదం

గద్వాల క్రైం: స్వగ్రామంలో ఉపాధి లేకపోవడంతో కొందరు వ్యవసాయ కూలీలు మరో ప్రాంతానికి కూలీ పనుల కోసం బొలెరో వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో.. కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో 26 మంది కూలీలకు గాయాలు కాగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గద్వాల మండలం జమ్మిచేడ్ స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలం పాతపాల్లెం, గంగన్‌పల్లి, జాంపల్లి గ్రామాలకు చెందిన 26 మంది కూలీలు మానవపాడు మండలం ధర్మవరం గ్రామంలో మిర్చి తెంచేందుకు బొలెరో గూడ్స్ వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని జమ్మిచేడ్ స్టేజీ వద్ద క్రాస్ రోడ్డు దాటేందుకు ట్రాక్టర్ వేగంగా రావడంతో బొలెరో వాహనం అదుపుతప్పి వెనక నుంచి ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో జాంపల్లికి చెందిన సవారన్న, పాతపాలెంకు చెందిన కృష్ణ, పావని, శాంతమ్మ, పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సవారన్న, కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా.. ట్రాక్టర్, బొలెరో వాహనం డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగంతో కూడిన డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ తదితరులు జిల్లా ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ ఘటనపై గద్వాల సీఐ శ్రీను, ఎస్‌ఐలు శ్రీకాంత్, కళ్యాణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్ నవీన్, బొలెరో వాహన డ్రైవర్ మహబూబ్ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఉమామహేశ్వరం హుండీ ఆదాయం రూ.11.36 లక్షలు



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలోని హుండీని సోమవారం లెక్కించారు. 4 నెలల 20 రోజులలో భక్తులు హుండీలో వేసిన డబ్బులు లెక్కించి, కానుకలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరమ్మ పర్యవేక్షణలో పరిశీలించారు. ఇందులో మొత్తం రూ.11,36,599 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సప్లయర్ ఇంట్లో అంగన్‌వాడీ సరుకులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన సీడీపీఓ


సప్లయర్ ఇంట్లో విచారణ జరుపుతున్న అధికారులు

జడ్చర్ల టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన సరుకులు సప్లయర్ ఇంట్లో నిల్వ ఉండటంతో జడ్చర్ల సీడీపీఓ శోభారాణి సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. అంగన్‌వాడీ కేంద్రాలకు బాలామృతం, పప్పు, నూనెలను జడ్చర్ల వెంకటేశ్వరకాలనీకి చెందిన కృష్ణారెడ్డి సరఫరా చేసే సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ప్రతి సరుకు గోదాం నుంచి మాత్రమే కేంద్రాలకు తరలించాల్సి ఉంది. అలాంటిది అతడి ఇంట్లో అక్రమంగా సరుకులు నిల్వ ఉన్నాయని ఆదివారం రాత్రి అంగన్‌వాడీ అధికారులకు సమాచారం అందింది. దీంతో అదేరోజు రాత్రి ఆప్రాంత అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్లు వెళ్లి పరిశీలించగా 111 కిలోల బాలామృతం 80కిలోల కందిపప్పు, 8లీటర్ల వంటనూనెలు ఉండటాన్ని గుర్తించి సీడీపీఓకు సమాచారమిచ్చారు. సోమవారం ఉదయం సీడీపీఓ శోభారాణి, ఆర్‌ఐ హర్షవర్ధన్‌రెడ్డిలతోపాటు పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేసి సరుకులను ఐసీడీఎస్ కార్యాలయానికి తరలించారు. గోడౌన్‌లో ఉండాల్సిన సరుకు ఇంట్లో ఎందుకు ఉంచుకున్నారని సప్లయర్‌ను ప్రశ్నించగా కేంద్రాలకు సప్లయ్ చేయగా మిగిలినది ఇక్కడ నిల్వచేసినట్లు చెప్పుకొచ్చారు.